జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

ఆదివారం 25-01-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :239 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : కాసే అమృత

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

# సంస్కరణల దేశంగా భారత్ ఎదుగుతోంది:

## రోజ్‌గార్ మేళాలో మోదీ




- సంస్కరణలు: భారత్ వేగంగా మారుతోందన్న సందేశం.
- గణాంకాలు: 61 వేల నియామకాలు అనే సంఖ్య పాఠకులను ఆకర్షిస్తుంది.
- భవిష్యత్తు: అంతర్జాతీయ ఒప్పందాల ద్వారా యువతకు కలిగే ప్రయోజనం.

సంస్కరణల దేశంగా భారత్ ఎదుగుతోందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఇందుకోసం పలు దేశాలతో వాణిజ్య, మొబిలిటీ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటోందన్నారు. తద్వారా భారతీయ యువతకు ప్రభుత్వం పలు అవకాశాలు సృష్టిస్తోందన్నారు. రోజ్‌గార్ మేళా సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. మోదీ వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో 61 వేల మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్ గార్ మేళా కార్యక్రమం.. నేడు ఓ సంస్థగా మారింది. ఈ ప్లాట్‌ఫాం ద్వారా లక్షల మంది ఉద్యోగాలు పొందారు. సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా భారత్ ఎదుగుతోంది. ప్రపంచంలో అత్యధిక యువ జనాభా మన దేశంలోనే ఉంది. వారికి సమగ్ర అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. అందుకు నిబద్ధతతో పనిచేస్తున్నాం. పలు దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. దీంతో దేశ విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయి" అని మోదీ తెలిపారు. రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 11 లక్షల మందికి పైగా యువతకు నియామక పత్రాలు అందజేసినట్లు ప్రధాన మంత్రి కార్యాలయం వెల్లడించింది.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం..

ఎయిరిండియాకు రూ.1,100కోట్ల బీమా సొమ్ము..!



2లో

## బెంగాల్‌లో 'సర్'..ఎందుకంత హడావుడి: ప్రశ్నించిన అమర్త్యసేన్




## స్వచ్ఛాంధ్ర మన జీవన విధానం కావాలి: చంద్రబాబు

నగరి: ఏడాది క్రితం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా ప్రారంభించినట్లు ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. చిత్తూరు జిల్లా నగరిలో ఆయన పర్యటించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని.. మన జీవన విధానం కావాలని పిలుపునిచ్చారు.

"మనం పీల్చే గాలి స్వచ్ఛంగా ఉండాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి.

పేజి 2లో



## సింగరేణిపై దుష్ప్రచారం...కట్టుకథలు



సైట్ విజిట్ నిబంధన గతంలో ఉన్నదే

ఎవరి ప్రయోజనం కోసం..ఎవరు చేస్తున్నారు

ఒకరు కథనం..మరోకరు లేఖ...ఇంకొకరు విచారణ

వీరికి ఉన్న సబంధం ఏమిటో ప్రజలకు తెలియాలి

సింగరేణిపై కిషన్ రెడ్డి విచారణను స్వాగతిస్తున్నాం

అన్ని వ్యవహారాలపై విచారణ జరగాలన్నదే తన అభిప్రాయం

మీడియా సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి

మిగతాది 2లో

## టీహబ్‌ను స్టార్టప్‌ల కేంద్రంగానే కొనసాగించాలి: సీఎం రేవంత్



హైదరాబాద్: టీహబ్‌ను స్టార్టప్‌ల కేంద్రంగానే కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ అంశంపై సీఎస్ రామకృష్ణారావుకు అమెరికా నుంచి ఫోన్ చేసి సీఎం మాట్లాడారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను టీహబ్‌కు మారుస్తున్నారనే వార్తలను ఖండించారు. టీహబ్‌లో ఇతర ఆఫీసులు ఉండకూడదని ఆదేశించారు. అలాంటి ఆలోచనలు అధికారులు విరమించుకోవాలన్నారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ ఆఫీసులను ఇతర ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సీఎం సూచించారు.

## ధరణి పోర్టల్ ద్వారా భూములు కబ్జా చేసిన వారిని వదిలిపెట్టం: మంత్రి పొంగులేటి



మిగతాది 2లో

హైదరాబాద్: ధరణి పోర్టల్ ద్వారా భూములు కబ్జా చేసిన వారిని, రిజిస్ట్రేషన్ చలానా సొమ్ము కాజేసిన వారిని వదిలేది లేదని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ధరణి పోర్టల్ ద్వారా అక్రమాలు చేసిన ఘటనలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. "పోర్టల్‌ను అడ్డం పెట్టుకొని గత ప్రభుత్వంలోని పెద్దలు భూములు కాజేశారు. సిద్ధిపేట, సిరిసిల్ల జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాం. కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాం. అనేక అవినీతి, అక్రమాలు జరిగినట్టు నివేదికలో స్పష్టమైంది. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి 35 వేల లావాదేవీలు జరిగాయి. 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు గుర్తించాం. 9 జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు. ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా నిర్వహిస్తాం" అని మంత్రి పొంగులేటి తెలిపారు.

## పిల్లలకు చట్టాలపై అవగాహన ఉండాలి:

### హోంమంత్రి అనిత



### చట్టాలపై అవగాహనతోనే ఉజ్వల భవిష్యత్తు

కశింకోట: అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తేగాడ మోడల్ స్కూల్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో హోంమంత్రి అనిత పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. క్రీడా మైదానం కావాలని విద్యార్థులు కోరగా.. ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులతో కలిసి హోంమంత్రి కేక్ కట్ చేశారు. చిన్న పొరపాట్ల వల్ల విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. పిల్లలకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. విద్యా వ్యవస్థలో మంత్రి నారా లోకేశ్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు.

## సీపీ సజ్జనార్ నోటీసులకు సమాధానం ఇస్తా: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



2లో

## కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్‌కు సిద్ధమా?: కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్: కేటీఆర్, హరీశ్‌రావు సహా అందరినీ సాక్షులుగా పిలిస్తే... అసలు ఫోన్ ట్యాపింగ్ దోషులెవరని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ దొంగలను సాక్షులుగా పిలవడమేంటన్నారు. సిట్ విచారణను ప్రత్యక్షంగా, పరోక్షంగా మంత్రులు ప్రభావితం చేసినట్లేనని.. ఇప్పటికైనా సిట్‌కు స్వేచ్ఛ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి లొంగితే సిట్ అధికారులకు ఉన్న క్రెడిబిలిటీ పోతుందన్నారు. కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదని, ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్ కు సిద్ధమా? అని సవాల్ విసిరారు. దేవుడి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేసే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు,

## ఎనిమిది మంది మావోయిస్టుల లొంగుబాటు

రామగుండం: రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఎదుట ఎనిమిది మంది మావోయిస్టు మిలీషియా సభ్యులు లొంగిపోయారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ.. మిగిలిన మావోయిస్టులంతా ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి పునరావాస పథకం ప్రయోజనాలను అందిస్తామని చెప్పారు.



# సంపాదకీయం

## అరుణ హరితం నియోగి జీవితం

స్వతంత్ర భారతదేశ చరిత్రలో పలువురు ప్రముఖ రాజకీయవేత్తల జీవితాలు హింసాత్మక మరణాలతో ముగిశాయి. తన తుది అరవైలలో ఇందిరాగాంధీ, తన నడిమి నలభైలలో రాజీవ్‌గాంధీ, తన మధ్య యాభైలలో ప్రమోద్ మహాజన్ దురంతాల పాలయ్యారు. సంజయ్‌గాంధీ, రాజేశ్ పైలట్, మాధవరావు సింధియా, వైఎస్ రాజశేఖరరెడ్డి జీవితాలు విమాన లేదా రోడ్డు ప్రమాదాలలో అర్ధంతరంగా ముగిశాయి. ఈ దురదృష్ట నాయకులు మరో ఇరవై సంవత్సరాలు జీవించి ఉన్న పక్షంలో వారి రాజకీయ జీవితాలు ఎటువంటి మలుపు తిరిగి ఉండేవో కదా!ఈ ప్రస్తావిత రాజకీయ నాయకుల మరణాల కంటే, మన వ్యవస్థలోని దౌష్ట్యానికి అకాల మరణం పాలైన మౌలిక చింతనాశీలి, కార్మిక సంఘనాయకుడు శంకర్ గుహ నియోగి మృతితో భారతదేశానికి ఎక్కువ నష్టం వాటిల్లిందని నేను గట్టిగా అభిప్రాయపడుతున్నాను. నియోగి మరణం మన దేశంలో పౌర సమాజ ఉద్యమానికి చావుదెబ్బ అయింది. బహుశా, అది ఆ విఘాతం నుంచి ఇప్పటికీ కోలుకోనే లేదు.నియోగి 1991లో 48 ఏళ్ల వయసులో పెట్టుబడిదారుల కిరాయి గూండాల కిరాతకానికి బలయ్యారు. కార్మికుల్లో ఆత్మగౌరవాన్ని మేల్కొలిపి, తమ యజమానుల వలే తామూ ఈ దేశ సమాన పౌరులమనే చైతన్యాన్ని వారిలో రగుల్కొలిపిన నియోగి ఉనికిని ఆ ధనస్వాములు భరించలేకపోయారు. తమకు అడ్డుగా ఉన్న నియోగిని క్రూరంగా తొలగించుకున్నారు.గతంలో నేను ఇదే కాలమ్‌లో నియోగి గురించి రాశాను. అయినా మళ్లీ రాసి తీరాల్సిన సందర్భమిది. సామాజిక శాస్త్రవేత్త రాధికా కృష్ణన్ పుస్తకం 'హఘ్ఘుఅస్ఝితీ +బఘ్ఘు చీఱఅశీఠ్రఱ : ~ూ ్రాశీశ్రీఠ్‌ఱఎం ఱఅ =వసఖఱఅ +తీవవఱ' వెలువడిన తరుణమిది. నియోగి పోరాట, త్యాగమయ జీవితం, ఇప్పటికీ ఆయన కృషి ప్రాధాన్యం ఏమిటో స్ఫూర్తిదాయకంగా రాధిక తన పుస్తకంలో వివరించారు.

1943లో ఒక బెంగాలీ కుటుంబంలో జన్మించిన నియోగి 19 ఏళ్ల వయసులో భిలాయి ఉక్కు కర్మాగారంలో కార్మికుడుగా జీవితాన్ని ప్రారంభించారు. ఆధునికత దిశగా భారతదేశ ప్రస్థానాన్ని వేగవంతం చేసిన ఆ సంస్థ ఉద్యోగం నుంచి చాలా త్వరగానే వైదొలిగి ప్రజాహిత క్రియాశీలతలో నియోగి నిమగ్నమయ్యారు. ఒక ఆదివాసీ మహిళను వివాహం చేసుకున్నారు. మైనింగ్ కార్మికులను సంఘటితం చేయడం ప్రారంభించారు. పర్యావరణ సుస్థిరత సంబంధిత విషయాలలో కూడా ఆయన మొదటి నుంచీ శ్రద్ధ చూపుతూ వచ్చారు. వ్యాపార, పారిశ్రామికవర్గాల ప్రయోజనాల పరిపూర్తికి కాకుండా స్థానిక రైతులు, ఆదివాసుల సంక్షమానికి దోహదం చేసేలా అటవీ, జల విధానాలను రూపొందించాలని ప్రభుత్వాన్ని నియోగి కోరారు. 1977లో 'ఛత్తీస్‌గఢ్ మైన్స్ శ్రామిక్ సంఘ్' (సీఎమ్‌ఎస్‌ఎస్) వ్యవస్థాపనకు నియోగి తోడ్పడ్డారు. రెండు సంవత్సరాల అనంతరం మరింత విశాల కార్యక్రమం ప్రాతిపదికన 'ఛత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా' (సీఎమ్‌ఎమ్) ఉనికిలోకి రావడంలో ఆయన ప్రత్యేక కృషి చేశారు. కార్మిక సంఘం సీఎమ్‌ఎస్‌ఎస్‌తో పాటు సీఎమ్‌ఎమ్‌లో మహిళా, యువజన, సాంస్కృతిక విభాగాలు కూడా ఉన్నాయి. గని కార్మికుల ఆర్థిక సహకారంతో ఆరోగ్య భద్రతలో ఒక పథ నిర్దేశక ఆస్పత్రిని కూడా సీఎమ్‌ఎమ్ నిర్వహించింది. నియోగి మరణం నాటి నుంచీ సీఎమ్‌ఎమ్, సీఎమ్‌ఎస్‌ఎస్ రెండూ కూడా కార్మిక హక్కుల సాధన, సామాజిక న్యాయం, పర్యావరణ సుస్థిరతకు కృషి చేస్తున్నాయి. ఆదర్శవాదులై మధ్యతరగతి భారతీయ యువజనులు తమ లాభదాయక వృత్తి జీవితాలకు స్వస్తి చెప్పి, శ్రామిక జనావళి సంక్షమం కోసం నియోగితో చేతులు కలిపి, ఆయన సంస్థల్లో పనిచేశారు. నియోగి బాటలో నడిచిన ప్రముఖులలో వెల్లూరులోని ప్రతిష్ఠాత్మక క్రిస్టియన్ మెడికల్ కాలేజీ పట్టభద్రుడు డాక్టర్ వినాయక్ సేన్, కాన్పూరు ఐఐటీ విద్యాధికురాలు సుధా భరద్వాజ్ తదితరులు ఉన్నారు.

నియోగి సీఎమ్‌ఎమ్ సంప్రదాయక కార్మిక సంఘాల వలే వేతన పెరుగుదల, సరైన పని పరిస్థితులు, సెలవు దినాలు, పీఎఫ్ సదుపాయాలు మొదలైన అంశాలకే పరిమితం కాకుండా ఒక కొత్త మార్గంలో పయనించింది. కార్మికుల వృత్తి సంబంధ ఆరోగ్య భద్రతకు విశేష కృషి చేసింది. నియోగి మౌలిక చింతకుడు. అయితే నిత్యం పోరాటాలలో నిమగ్నమయి ఉండవలసి రావడంతో అరుదుగా మాత్రమే తన భావాలకు లిఖిత రూపమిచ్చేవారు. 'హమారా పర్యావరణ్' అనే వ్యాసం సుప్రసిద్ధమైనది. వాయు, జల కాలుష్యాలు, నేల క్రమ క్షయం మొదలైనవి మానవ జీవితాలకు, జీవనాధారాలకు చాలా హాని కలిగిస్తున్నాయని, లాభార్జనే లక్ష్యంగా పనిచేస్తున్న పారిశ్రామికవేత్తలే ఆ నష్టాలకు ప్రధాన కారకులని సీఎమ్‌ఎమ్ డాక్యుమెంట్లలో స్పష్టంగా ఉందని రాధికా కృష్ణన్ తన పుస్తకంలో వివరించారు.

భారతదేశ పరిస్థితులకు సరిపడే ఉత్పత్తి సంబంధిత సాంకేతికతల విషయంలో నియోగి విశేష శ్రద్ధాసక్తులు చూపేవారు. ఐరోపా, అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న భారీ యంత్రాలు సమాజంలో వర్గం, జెండర్ ప్రాతిపదికన అసమానతలు సృష్టిస్తాయని ఆయన తరచూ విమర్శిస్తుండేవారు. యాంత్రీకరణకు ఎక్కువగా నష్టపోతుంది మహిళలేనని సీఎమ్‌ఎమ్ గుర్తించిందని రాధిక రాశారు. దల్లీ గనులలో పని చేసే కార్మికులలో సగం మంది మహిళలేనని, అయితే పూర్తిగా యాంత్రీకరణ అయిన గనులలో మహిళలను అనిపుణ కార్మికులుగా భావిస్తూ వారి శ్రమను ఉపయోగించుకోవడానికి యజమానులు నిరాకరిస్తున్నారని ఆమె రాశారు. ఇలా మహిళా కార్మికులకు ఉపాధిని నిరాకరించడం వారి ఆర్థిక స్వేచ్ఛ, మహిళా అస్తిత్వ గౌరవంపై దాడి చేయడమేనని సీఎమ్‌ఎమ్ గట్టిగా అభిప్రాయపడిందని రాధిక వెల్లడించారు. జీవనాధారాలకు భద్రత కల్పించి, కార్మికుల కొనుగోలు సామర్థ్యం పెంపొందించడం ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించే ప్రత్యామ్నాయ ఉత్పత్తి కార్యకలాపాల నమూనాను రూపొందించేందుకు నియోగి, ఆయన నాయకత్వంలోని సీఎమ్‌ఎమ్ కృషి చేశాయని రాధికా కృష్ణన్ పేర్కొన్నారు.నియోగి తన సమకాలీన ఉద్యమం నొకదాని గురించి రాసిన మాటలను కూడా రాధిక ఉటంకించారు: 'చిప్కో ఉద్యమం మమ్ములను ఉత్తేజపరిచింది. అది ఒక విప్లవాత్మక ఉద్యమంగా మేము గుర్తించాము'. ఆమె పుస్తకం చదువుతుంటే నియోగి, చిప్కో ఉద్యమ నేత చండీప్రసాద్ భట్‌ల మధ్య ఉన్న సామ్యాలు నన్ను చకితపరిచాయి. నియోగి హరిత మార్క్సిస్టు. భట్ (ఇంకా మన మధ్య నడయాడుతున్నారు) ఒక వామపక్ష గాంధేయవాది. ఇరువురూ పర్యావరణ స్థిరత్వాన్ని సామాజిక న్యాయంతో అనుసంధానించారు. ఇరువురూ సమాజంలో అట్టడుగు స్థాయి ప్రజల సంక్షమాన్ని కాంక్షించిన మేధావులు. ఆ ఆదర్శాన్ని ఆచరణలోకి తీసుకురావడమే తమ జీవితధ్యేయంగా చేసుకున్న ఉదాత్తులు. సదా శ్రామికులు, రైతుల మధ్య కృషి చేస్తూనే దేశాభ్యున్నతికి, ప్రపంచ శ్రేయస్సుకు విస్తృత దృక్పథన్ని వ్యక్తం చేసినవారు. శంకర్ గుహ నియోగి మూడున్నర దశాబ్దాల క్రితం మైనింగ్ మాఫియా ఘాతుకానికి బలయ్యారు. అయినప్పటికీ ఆయన జీవిత కృషి వర్తమాన భారతదేశానికి చాలా సందర్భోచితంగా ఉన్నది. అది నేటి భారతదేశంతో కనీసం ఐదు ప్రధాన మార్గాలలో శక్తిమంతంగా మాట్లాడుతున్నది. అవి: (అ) అసంఘటిత రంగ కార్మికుల అనిశ్చిత పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రాధాన్యమిచ్చింది (నిర్మాణ రంగంలోను, గిగ్ ఎకానమీలోను లక్షలాది కార్మికుల జీవన పరిస్థితులు ఎంత దుర్భరంగా ఉంటున్నాయో మరి చెప్పనవసరం లేదు); (ఆ) ప్రజాస్వామ్య సుస్థిరతలో స్వతంత్ర పౌరసమాజ సంఘాల పాత్రకు ప్రాధాన్యం. తన హిందూత్వ భావజాలంతో ఏకీభవించని పౌర సమాజ బృందాలను బీజేపీ పలు విధాలా బెదిరింపులు, వేధింపులకు గురి చేస్తున్న ప్రస్తుత తరుణంలో స్వతంత్ర పౌర సమాజ సంఘాల అవసరం మరింతగా ఉంది; (ఇ) అభివృద్ధి సాధనతో పర్యావరణ సుస్థిరతను సమ్మిళితపరచవలసిన ఆవశ్యకత. మన నగరాలలో పెరిగిపోతున్న వాయు కాలుష్యం భూగర్భ జలాలు అంతకంతకూ తరిగిపోతుండడం, నదులు కాలుష్య కాసారాలుగా మారిపోతుండడం, హిమాలయాలు, పశ్చిమ కనుమలు, ఆరావళి పర్వతాలను మౌలిక సదుపాయాల, మైనింగ్ కంపెనీలు విచక్షణారహితంగా దుర్వినియోగం చేస్తున్నాయి. అధికారంలో ఉన్నవారి అండదండలు వాటికి లభిస్తున్నాయి. పర్యావరణ విధ్వంసానికి వ్యతిరేకంగా శంకర్ గుహ నియోగి, ఇంకా చండీప్రసాద్ భట్ హెచ్చరికలను విస్మరించడం వల్ల సంభవిస్తున్న ఈ హాని అంతా ఇంతా కాదు; (ఈ) నియోగి జీవిత కృషి మరింత అర్థవంతమైన అంటే తక్కువ దోపిడీదాయక, తక్కువ విధ్వంసక అభివృద్ధి నమూనాను సూచిస్తుంది. ఛత్తీస్‌గఢ్, జార?ండ్, ఉత్తరాఖండ్ లాంటి చిన్న రాష్ట్రాలు అవశ్యం అనుసరించాల్సిన అభివృద్ధి నమూనా అది;

## కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్‌కు సిద్ధమా?: కేంద్రమంత్రి బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి

వ్యాపారులతోపాటు బీఆర్‌ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నెంబర్లను చేర్చింది నిజం కాదా? అన్నారు. ఆఖరికి కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ఆ జాబితాలో చేర్చి ఫోన్ ట్యాపింగ్ చేయించలేదా?అని నిలదీశారు. హైదరాబాద్ నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో బండి సంజయ్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయి

సింగరేణి సంస్థను కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కలిసి దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. గతంలో కేసీఆర్ కుటుంబమే దోచుకుంటే...కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారన్నారని విమర్శించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్‌ఎస్ లేఖ రాస్తే... బీఆర్‌ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా? అని ఉప ముఖ్యమంత్రి భట్టి చెబుతున్నారని...సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

2014 నుంచి ఇప్పటి వరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని తెలిపారు. తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే... గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు. సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనని.. ఆ సంస్థలో దోచుకున్న సొమ్ముతోనే బీఆర్‌ఎస్ పార్టీని ఇన్నాళ్లు నడిపించారని పేర్కొన్నారు. రూ.42వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుని సింగరేణిని అప్పుల పాల్జేసిందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామంటారు.. అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మంతా దారి మళ్లించడం పరిపాటైందన్నారు. సింగరేణి ప్రజలు, కార్మికులు రెండు పార్టీల తీరును చూసి అసహ్యించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ తోడు దొంగలేనని...మా భాగోతం మీరు బయటపెడితే... మీ భాగోతం మేం బయటపెడతామంటూ మాట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

## బెంగాల్‌లో 'సర్'..ఎందుకంత హడావుడి: ప్రశ్నించిన అమర్త్యసేన్

మొదటి పేజీ తరువాయి

పశ్చిమ బెంగాల్‌లో నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై నోబెల్ గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ ఆందోళన వ్యక్తంచేశారు. కొన్నినెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ప్రక్రియను హడావుడిగా నిర్వహించడం సరికాదన్నారు. ఈ మేరకు ఆయన జాతీయ మీడియా సంస్థతో మాట్లాడారు.

"ఇలాంటి ప్రక్రియలు చాలా జాగ్రత్తగా, తగిన సమయం తీసుకొని నిర్వహించాలి. అయితే బెంగాల్ విషయంలో అలా జరగడం లేదని భావిస్తున్నాను. కొన్నిసార్లు ఎన్నికల సంఘం అధికారులకే తగిన సమయం లేదనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో జన్మించిన చాలామంది భారత పౌరుల వలే నాక్కూడా జన్మ ధ్రువీకరణ పత్రం లేదు. ఓటర్‌గా నా అర్హతను నిరూపించుకోవడానికి సంబంధిత పత్రాలను సమర్పించాల్సి వచ్చింది. నా సమస్య తీరింది. అయితే అందరూ ఇంతవేగంగా స్పందించలేకపోతే.. వారి సంగతి ఏంటి..? నా సొంత నియోజకవర్గం శాంతి నికేతన్‌లో నాకున్న ఓటు హక్కు గురించి అధికారులు ప్రశ్నించారు. ఇతర వివరాలు అడిగారు. ఇవన్నీ ఇప్పటికే రికార్డుల్లో భద్రపరిచి ఉన్నాయికదా..?" అని ప్రశ్నించారు.

ఇదిలాఉంటే.. సర్ విచారణకు హాజరుకావాలని అమర్త్యసేన్ కు ఈసీ నోటీసులు ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. "ఆయన ఒక నోబెల్ గ్రహీత. దేశం గర్వించదగ్గ ఆయనను విచారణకు ఎలా పిలుస్తారు?" అని తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఈ సర్‌ను కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సహా ఇతర విపక్షలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. కాగా.. ఎస్ఐఆర్ రెండో దశలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరి ఉన్నాయి. గతేడాది తొలిదశ బిహార్‌లో పూర్తయింది. ఆ తర్వాత అక్కడ అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగాయి. బెంగాల్‌లోనూ సర్ ముసాయిదా జాబితా విడుదలయింది.

## సింగరేణిపై దుష్ప్రచారం...కట్టుకథలు

హైదరాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ): హైదరాబాద్, జనవరి 24: సింగరేణి పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు రాతలు రాస్తున్నారని, ఈ నినాదాల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి? అంటూ ప్రశ్నలు సంధించారు. అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థపై నిందలు మోపుతూ, కార్మికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని డిప్యూటీ సీఎం ఆగ్రహించారు. శనివారం నాడు ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణిపై కట్టుకథలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వంపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. 'ఒకరు కథనం రాశారు, మరొకరు లేఖ రాశారు, ఇంకొకరు విచారణకు ఆదేశించారు, ఈ ముగ్గురికీ ఉన్న సంబంధం ఏంటి' అని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. సింగరేణి అటానమస్ సంస్థ అని, అన్ని నిర్ణయాలు వారే తీసుకుంటారని భట్టి తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రావడం, విచారణ జరిపించడాన్న స్వాగతిస్తున్నామని చెప్పారు. సింగరేణిలో తాను వచ్చాకే సైట్ విజిట్ నిబంధన వచ్చిందని ప్రచారం చేస్తున్నారని, నిజాలు బయటకు రావాలని, ప్రజలకు తెలియాలని చెప్పుకొచ్చారు. 2018లోనే సైట్ విజిట్ నిబంధనను కోల్ ఇండియా తీసుకొచ్చిందని, 2021లో ఎన్ఎమ్‌డీసీ కూడా అమలు చేసిందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 2023లో సింగరేణిలోనూ సైట్ విజిట్ కండీషన్ అమల్లోకి వచ్చిందని, సీఎమ్‌పీడీఐ డాక్యుమెంట్‌లో సైట్ విజిట్ తప్పనిసరని ఉందని చెప్పారు. 2018, 2021లో డిప్యూటీ సీఎం భట్టి లేదని, కాంగ్రెస్ లేదని ఆయన గుర్తు చేశారు. దేశంలోని పలు కేంద్ర, రాష్ట్ర సంస్థలు సైట్ విజిట్ అమలు చేస్తున్నాయన్నారు. రైల్వే, హిందుస్థాన్ కాపర్స్, గుజరాత్ ఇండస్ట్రీస్ పవర్ కంపెనీ, మహారాష్ట్ర ప్రభుత్వ టెండర్లలోనూ ఈ నిబంధన ఉందని భట్టి పేర్కొన్నారు. సైట్ విజిట్ ఎక్కడా లేదన్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దురుద్దేశంతో రాసిన ఓ కథనం ఆధారంగా ఒక నేత లేఖ రాశారని, అపోహలు పెరుగుతాయని వెంటనే టెండర్లు రద్దు చేశామని భట్టి తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లకు బీఆర్‌ఎస్ హయాంలోనే టెండర్లు పిలిచారని, దేశంలో ఏ మైనింగ్ యాక్టివిటీలోనూ డీజిల్ సప్లయ్ చేసే పరిస్థితి లేదని చెప్పారు. 2022లో నైనీ బ్లాక్ టెండర్లలో డీజిల్ విధానం మార్చారని వెల్లడించారు. సింగరేణి 25 టెండర్లలో 20 బీఆర్‌ఎస్ హయాంలోనే జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 5 టెండర్లే జరిగాయని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటివరకు కాంగ్రెస్‌కు సంబంధించిన ఎవరికీ టెండర్లు రాలేదని అన్నారు. సృజన్‌రెడ్డితో సీఎంకు సంబంధాలున్నాయన్న వార్తల్లో నిజం లేదన్నారు. సృజన్‌రెడ్డి కంపెనీ శోధ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అని, ఎండీ దీప్తి రెడ్డి కందాల కూతురు అని, సృజన్‌రెడ్డి బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే అల్లుడని భట్టి వివరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు అసలు ఏం కావాలని, కేంద్రానికి ఎందుకు లేఖలు రాస్తున్నారని ఉపముఖ్యమంత్రి ప్రశ్నించారు. 2014

నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని టెండర్లపై విచారణ జరపాలని తనకు లేఖ రాయాలన్నారు. తాడిచర్ల నుంచి నైనీ వరకు అన్నింటిపై దర్యాప్తు చేద్దామని

## అమరావతిని ఆపలేరు.. ప్రపంచం మెచ్చేలా అభివృద్ధి చేస్తాం:




నగరి: 2024 ఎన్నికలకు ముందు రాష్ట్రం అతలాకుతులమైందని, మాట్లాడాలన్నా.. నవ్వాలన్నా భయపడే పరిస్థితి వచ్చిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లా నగరిలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లోనే 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. దేశంలోకి వచ్చిన ఎఫ్‌డీఐల్లో 25 శాతం ఏపీకి వచ్చాయంటే.. సుపరిపాలనకు నిదర్శనమని చెప్పారు. ఎన్ని కుయుక్తులు పన్నినా.. అమరావతిని అడ్డుకోలేరని చంద్రబాబు స్పష్టం చేశారు."ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉంటుంది. ప్రపంచం మెచ్చే రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేస్తాం. అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తూ అన్ని ప్రాంతాలను ప్రగతిపథంలో నడిపిస్తాం. ఎవరెన్ని కుయుక్తులు చేసినా.. అమరావతి అభివృద్ధిని అడ్డుకోలేరు" అని సీఎం అన్నారు.

సమర్థ నాయకత్వం ఉంటేనే..

"గత ఐదేళ్లు రాష్ట్రంలో అంతా అరాచకమే. నాలాంటి వాళ్లనే జైల్లో పెట్టారు. సామాన్యులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ప్రజలు ఆశీర్వదించి.. 94 శాతం మంది అభ్యర్థులను గెలిపించారు. సమర్థ నాయకత్వం ఉంటే ప్రజల జీవితాల్లో పెనుమార్పులు వస్తాయి. చెడు చేసినవారిని గుర్తుపెట్టుకుని.. మంచి చేస్తున్నవారిని ప్రోత్సహించాలి. ఎన్నికలకు ముందు కరెంట్ ఛార్జీలు పెంచనని చెప్పా. హామీకి కట్టుబడి ఉన్నా. కరెంటు కొనుగోలు ఖర్చులు తగ్గించుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసి చూపించింది. చెడు ఆలోచనలు పెట్టుకుని నేరస్థులు రాజకీయాలు చేసి రాష్ట్రానికి భవిష్యత్ లేకుండా చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం ఇ–ఆటోలు, ట్రై సైకిళ్లు ఇచ్చాం. గత ప్రభుత్వం లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను పట్టణ ప్రాంతాల్లో వదిలేసి వెళ్లిపోయింది. దీంతో భూగర్భజలాలు, వాయు కాలుష్యం పెరిగిపోయింది. ఇప్పుడు ఆ వ్యర్థాలన్నీ తొలగించి మళ్లీ శుభ్రమైన పరిస్థితులు తీసుకువస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు.

## స్వచ్ఛాంధ్ర మన జీవన విధానం కావాలి: చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

మన ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలి. చెడు ఆలోచనలతో నేరస్థులు రాజకీయాలు చేస్తే ఏమవుతుందో చూశాం. స్వచ్ఛమైన ఆలోచనలు ఉంటేనే భవిష్యత్తు ఉంటుంది . మార్చిలోపు కోటి 12 లక్షల టన్నుల చెత్తను పూర్తిగా తొలగిస్తాం. చెత్త నుంచి కరెంట్ తయారు చేసే ప్రాజెక్టులు విశాఖ, గుంటూరులో వచ్చాయి. కర్నూలు, రాజమహేంద్రవరం, కడప, నెల్లూరులో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. వారానికి ఒకసారి స్వచ్ఛ రథలు వచ్చేలా చేస్తున్నాం. చెత్త తీసుకుని తిరిగి నిత్యావసర వస్తులు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. 2018లోనే రాష్ట్రాన్ని ఓడిఎఫ్‌గా తయారు చేశాం. ఇప్పుడు ఓడిఎఫ్ ప్లస్ దిశగా వెళ్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.

గత ఐదేళ్లూ దోపిడీనే..

గత ఐదేళ్లలో శాండ్, మైన్, వైన్.. అన్నింట్లోనూ దోపిడీనే సాగిందని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. ఆఖరికి శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రసాదంలో నెయ్యి కూడా కల్తీనేనని అన్నారు. తానేదో క్రెడిట్ చోరీ చేస్తున్నానని జగన్ విమర్శిస్తున్నారని, పద్ధతిలేని రాజకీయాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసిన వారు కూడా నీతులు మాట్లాడతారా? అని ప్రశ్నించారు.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. ఎయిరిండియాకు రూ.1,100కోట్ల బీమా సొమ్ము..!

మొదటి పేజీ తరువాయి

అహ్మదాబాద్‌లో గతేడాది చోటుచేసుకున్న దిగ్భ్రాంతికర విమాన ప్రమాద ఘటన లో విమానయాన సంస్థ ఎయిరిండియాకు పలు బీమా కంపెనీలు, రీఇన్సూరర్ల నుంచి పరిహారం అందింది. ఎయిర్‌లైన్‌కు రూ.1,100 కోట్లకు పైగా చెల్లించినట్లు ఇన్సూరెన్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనం పేర్కొంది.

గతేడాది జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలింది. అది ఒక మెడికల్ కాలేజీ హాస్టల్‌పై పడింది. ఈ ఘటనలో విమానం తునాతునకలైంది. అది పూర్తిగా ధ్వంసం కావడంతో బీమా కంపెనీలు, రీఇన్సూరర్లు 125 మిలియన్ డాలర్లు (రూ.1,100 కోట్లకుపైగా) బీమా మొత్తాన్ని చెల్లించాయి. అలాగే ప్రమాదంలో మరణించిన మృతుల బంధువులకు 25 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించే ప్రక్రియ మొదలైనట్లు ఆ సంస్థలు పేర్కొన్నాయి. అయితే ఆ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదని, ఆ మొత్తం పెరిగే అవకాశం ఉందని వెల్లడించాయి.

దేశవ్యాప్తంగా 717 స్లాట్‌లు ఖాళీ చేసిన ఇండిగో

కాగా.. ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒకే ఒక్క వ్యక్తి మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. విమానం హాస్టల్‌పై పడటంతో మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. వీరి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేలా టాటా గ్రూప్ ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. క్షతగాత్రుల వైద్య ఖర్చులు, మెడికల్ కాలేజీ పునరుద్ధరణ, సమీపంలో విమాన శకలాల కారణంగా దెబ్బతిన్న వాటిని పునరుద్ధరించడం కోసం ఆ ట్రస్ట్ నిధులను వినియోగిస్తున్నారు.

## సీపీ సజ్జనార్ నోటీసులకు సమాధానం ఇస్తా: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: నగర పోలీస్ కమిషన్ సజ్జనార్ ఇచ్చిన నోటీసులకు సమాధానంగా తన వద్ద ఉన్న సమాచారంతో జవాబు ఇస్తానని, ఆ తరువాత ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చని భారత రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సజ్జనార్ నోటీసుల నేపథ్యంలో ఎక్స్ వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాను వ్యక్తిగత దూషణలు చేయనని, చిల్లర భాష వాడనని, వాస్తవాలు దాచనని, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం ఆపబోనని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్, హరీశ్ రావుకు సంబంధం లేకున్నా నోటీసులు ఇచ్చి సిట్ గంటల తరబడి దర్యాప్తు పేరిట వేధిస్తున్న ప్రహసనాన్ని ఖండించిన 12 గంటల్లోనే పోలీసులు ఇంటికి వచ్చిన తనకు నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రెండు రోజుల్లో ఆధారాలతో సహా సమాధానం ఇవ్వకపోతే సివిల్, క్రిమినల్ చర్యలకు సిద్ధం కావాలని హెచ్చరించారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రజా సమస్యలు, దౌర్జన్యాలపై గొంతెత్తడం తన హక్కని.. వార్నింగ్‌లకు భయపడబోనని పేర్కొన్నారు. సిట్ ఛీఫ్ సజ్జనార్ మీద ఏపీలో నమోదైన కేసులపై మరో సిట్ వేయాలని తాను డిమాండ్ చేసినట్లు నోటీసులో ఉందని, అది వాస్తవ విరుద్ధమని తోసిపుచ్చారు. పోలీస్ అధికారులు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ రాజకీయ క్రీడలో పావులుగా మారవద్దని సలహా ఇచ్చినట్లు తెలిపారు. నాటి డీజీపీ, హోంసెక్రెటరీ, సీఎస్ లాంటి అధికారులందరినీ విడిచిపెట్టి సిట్ అధికారులు కేవలం విశ్రాంత ఐపీఎస్ ప్రభాకర్ రావు, ఆయన కుటుంబాన్ని, ఆయనతో పనిచేసిన కానిస్టేబుళ్లు, బంధువులను వేధించడం అన్యాయమని చెప్పినట్లు వివరించారు. తాను సజ్జనార్ సహా ఏ అధికారి, ఏ రాజకీయ నాయకుడి వ్యక్తిత్వ హననానికి పాల్పడలేదని... ఆ సంస్కృతి తనకు లేదని తెలిపారు.

# మంత్రి ఆశీస్సులతో మున్సిపల్ ఎన్నికల బరిలోకి పట్లోళ్ల రేఖ ప్రవీణ్

**- 10వ వార్డు అభివృద్ధి, సంక్షేమం కొనసాగించేందుకే నా రాజకీయ అడుగు**

**జోగిపేట, జనవరి 24(సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్)**



తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆశీస్సులతో జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పట్లోళ్ల రేఖ ప్రవీణ్ ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గతంలో తనకు అవకాశం ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించిన 10వ వార్డు ప్రజల నమ్మకాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. గత ఐదేళ్లుగా వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలవడం తన ప్రధాన లక్ష్యంగా కొనసాగిందని తెలిపారు. "మా కుటుంబం ప్రజాసేవనే లక్ష్యంగా రాజకీయాల్లో కొనసాగుతోంది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ నిరంతరం సేవ చేయడమే నా ఆశయం" అని ఆమె పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కూడా 10వ వార్డు ప్రజలు తనపై ఆదరాభిమానాలు, ఆశీస్సులు కురిపించి గెలిపిస్తే, మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. గత 22 సంవత్సరాలుగా రాజకీయ రంగంలో కొనసాగుతూ, మచ్చలేని నాయకురాలిగా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నానని తెలిపారు. 10వ వార్డు ప్రజల కుటుంబ సభ్యురాలిగా వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని పట్లోళ్ల రేఖ ప్రవీణ్ స్పష్టం చేశారు.

# రాజ్‌భవన్‌లో ఘనంగా ఉత్తరప్రదేశ్, దాద్రా నగర్ హవేలీ, డామన్ దీవుల ఆవిర్భావ వేడుకలు



**హైదరాబాద్, సందేశం టైమ్స్ - రిపోర్టర్ శెట్టి వెంకటేష్ గౌడ్:**
హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ (లోక్ భవన్)లో ఉత్తరప్రదేశ్, దాద్రా నగర్ హవేలీ మరియు డామన్ దీవుల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్‌ను భారతీయ సంస్కృతికి మరియు ఆధ్యాత్మికతకు గుండెకాయగా అభివర్ణించారు. 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్ఫూర్తితో నిర్వహించిన ఈ వేడుకల్లో జాతీయ సమగ్రత, సహకార సమాఖ్య స్ఫూర్తిని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గంగా అవతరణ్ కథక్, ఝాన్సీ కీ రాణి వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీ అనురాగ్ శర్మ, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ దాన కిషోర్ మరియు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

# బాలికా సాధికారతతోనే నవసమాజ నిర్మాణం: జాతీయ బాలికా దినోత్సవ వేడుకల్లో జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు




**సూర్యాపేట పెన్ పహాడ్, సందేశం టైమ్స్ - రిపోర్టర్ శెట్టి వెంకటేష్**
పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు మాట్లాడుతూ, బాలికలు ఆకాశమే హద్దుగా ఎదగాలని, బాల్య వివాహాలు వారి భవిష్యత్తుకు శాపాలని హెచ్చరించారు. ప్రతి అమ్మాయి తన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, 'బేటీ బచావో - బేటీ పడావో' నినాదాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జిల్లా వైద్యాధికారి వెంకటరమణ బాలికల ఆరోగ్యం, పౌష్టికాహారం మరియు పీసీపీఎన్డీటీ చట్టంపై అవగాహన కల్పించగా, జఔజ చైర్మన్ రమణారావు ఆపద సమయంలో 1098 చైల్డ్ లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించిన ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికుమార్, సఖి కేంద్రం ప్రతినిధులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలి,మంత్రి తుమ్మల

**సందేశం టైమ్స్:**
జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా, మొగుళ్లపల్లి మండలం,పాత ఇస్సీపేట గ్రామంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న 10,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కూడిన గోదాముల శంఖుస్థాపన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్స్ టెక్స్టైల్స్ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు గారు ముఖ్య అతిథిగా పాల్గొని శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి పలు కీలక



చర్యలు చేపడుతోందని తెలిపారు. పంట ఉత్పత్తి పెరిగిన నేపథ్యంలో రైతులు తమ పంటను సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ఆధునిక గోదాముల అవసరం ఎంతో ఉందని,ఆ అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర వ్యాప్తంగా గిడ్డంగుల సామర్థ్యాన్ని పెంచుతున్నామని అన్నారు. పాత ఇస్సీపేట గ్రామంలో నిర్మించనున్న ఈ 10,000 మెట్రిక్ టన్నుల గోదాములు పూర్తయ్యాక, ఈ ప్రాంత రైతులకు పంట



నిల్వ, మార్కెటింగ్ పరంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. గోదాముల ఏర్పాటుతో రైతులు తక్కువ ధరలకు పంట అమ్మాల్సిన పరిస్థితి తగ్గి,సరైన సమయంలో మెరుగైన ధరలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అంతేకా కుండా,పంట నష్టం తగ్గి, రైతుల ఆదాయం పెరగడంలో ఈ గోదాములు కీలక పాత్ర పోషిస్తా యని అన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశానికి అన్నపూర్ణగా మారాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, గిడ్డంగులు, మార్కెట్ యార్డులు, ప్రాసెసింగ్ యూనిట్లు వంటి మౌలిక సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వివరించారు. రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతి నిధులు,తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజలు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా మంత్రి కి గ్రామస్తులు, రైతులు ఘన స్వాగతం పలికారు.

# అశ్వారావుపేటలో వ్యాపారుల రాస్తారోకో

**అశ్వారావుపేట, జనవరి 24 సందేశం టైమ్స్:**
అశ్వారావుపేట జంగారెడ్డిగూడెం రహదారి అధ్వానంగా మారిందని నిరసిస్తూ శనివారం స్థానిక వ్యాపారులు నిరసన చేపట్టారు. రింగ్ రోడ్డు సెంటర్లో బైఠాయించి రాస్తారోకో నిర్వహించడంతో వాహనాలు నిలిచిపోయాయి. రోడ్డు అస్తవ్యస్తంగా మారి దుమ్ము ధూళి వస్తుండటంతో అటు వాహనదారులు, ఇటు దుకాణదారులు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టి తమను కాపాడాలని డిమాండ్ చేశారు.



**దుమ్ము ధూళి నుండి విముక్తి కల్పించండి: జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ దేగల రాము డిమాండ్**

అశ్వారావుపేట పట్టణంలో సెంట్రల్ లైటింగ్ మరియు రహదారి పనుల జాప్యం వల్ల వ్యాపారస్తులు, ప్రజలు దుమ్ము ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దేగల రాము ఆవేదన వ్యక్తం చేశారు. పనులు ప్రారంభించిన నాటి నుండి నేటి వరకు దుమ్ము సమస్య వేధిస్తూనే ఉందని, రింగురోడ్డు పనులను గాలికొదిలేయడం వల్ల అటు వ్యాపారాలు దెబ్బతిని ఇటు ప్రజల ఆరోగ్యం పాడవుతోందని మండిపడ్డారు. అధికారులు తక్షణమే స్పందించి రింగురోడ్డు పనులు పూర్తి చేయాలని, నిధులు లేకపోతే రోడ్డును వన్వే చేసి ప్రజలకు ఈ దుమ్ము నరకం నుండి విముక్తి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

**రోడ్ల దుస్థితిపై రామకృష్ణ ఆవేదన**

మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల దుస్థితిపై స్థానిక రామకృష్ణ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా ఇక్కడ విధుల్లో ఉన్న ఆయన, రోడ్ల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని ఆవేదన చెందారు. ముఖ్యంగా రోడ్లపై డివైడర్లు ఏర్పాటు చేసినప్పటి నుంచి సమస్య మరింత జటిలమైందని, వాహనాలు వెళ్లేటప్పుడు వచ్చే దుమ్ము పొగమంచులా కమ్మేస్తుండటంతో ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా మారిందని ఆయన పేర్కొన్నారు. సాధారణ ప్రజలు బయటకు వచ్చి ఏదైనా వస్తువు కొనాలన్నా లేదా రోడ్డుపై నడవాలన్నా భయపడే పరిస్థితి నెలకొందని ఆయన వాపోయారు. స్థానికులు ఇంతటి కాలుష్య కోరల్లో ఎలా జీవిస్తున్నారో అర్థం కావడం లేదని, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. తాను ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తిని కాకపోవడం వల్లే సంయమనం పాటిస్తున్నానని, లేదంటే అధికారులను గల్లా పట్టి నిలదీసేవాడినని ఆయన తన అసహనాన్ని వ్యక్తం చేశారు. రోడ్డు పనుల జాప్యంపై స్థానికుల నిరసన: దుమ్ముతో ఊపిరి ఆడని పరిస్థితి గత కొంతకాలంగా కొనసాగుతున్న రోడ్డు పనుల వల్ల స్థానిక ప్రజలు మరియు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఇంకా పూర్తి కాకపోవడంతో ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ముఖ్యంగా రోడ్డుపై విపరీతంగా పేరుకుపోయిన దుమ్ము వల్ల శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా మారిందని, కనీసం దుమ్ము లేవకుండా నీళ్లు చల్లించే బాధ్యత కూడా అధికారులు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డును ఒకవైపు మూసివేసి పనులు చేస్తున్న సమయంలో కనీసం వన్ వే సౌకర్యం కల్పించకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎటువంటి మార్పు రాలేదని, ఇప్పటికైనా స్పందించి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో మనుషులు చనిపోయే పరిస్థితి వస్తుందని, తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు.

# ఉత్తమ అధికారిగా జిఎం .ఎం. షాలేం రాజు ఎంపిక

**- 77వ గణతంత్ర దినోత్సవ సందర్భముగా కొత్తగూడెం ఏరియా**
**- ఎంపిక అయిన ఏరియా ఉత్తమ అధికారి ఉద్యోగి (సెంట్రల్ ప్రోగ్రాం గనుల వారిగా ఉత్తమ ఉద్యోగులు వీర**

**సింగరేణి, జనవరి 24 సందేశం టైమ్స్:**
77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా కొత్తగూడెం ఏరియాకు గాను (సెంట్రల్




ప్రోగ్రాం) కు ఏరియా ఉత్తమ అధికారి గా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న ఎం. షాలేం రాజు ఎంపికగా ఉత్తమ ఉద్యోగి గా బి. సురేష్ బాబు, ఎలక్ట్రీషియన్ (ఓసిపి), వికే ఓసి ఎంపిక అయ్యారు. గనుల వారి ఉత్తమ ఉద్యోగులుగా 1) కాంపల్లి వాసు, వైండింగ్ ఇంజన్ ఆపరేటర్, పద్మావతిఖని, 2) వళ్ళాల సాంబ మూర్తి , కోల్ కట్టర్, పద్మావతిఖని, 3) ఎం. రామ కృష్ణ ప్రసాద్, ఈపి ఫిట్టర్ కమ్ మెకానిక్, వికే కోల్ మైన్స్, 4) చిల్లపల్లి. రామకృష్ణ, సర్వేయర్, వికే కోల్ మైన్స్ 5) కుందూరు శ్రీనివాస్ రెడ్డి, కన్వేయర్ ఆపరేటర్,ఆర్.సి.హెచ్.పి ఎంపిక చేయడం జరిగింది. వీరికి 26 జనవరి 2026న రుద్రంపూర్ ప్రొ. జయశంకర్ స్టేడియం నందు ఉదయం 09.30గంటలకు జరుగు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం చేతుల మీదుగా సన్మానం జరుగును. అలాగే కొత్తగూడెం ఏరియా ఉత్తమ అధికారిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న ఎం. షాలేం రాజుకి ఉత్తమ ఉద్యోగి గా బి. సురేష్ బాబు, ఎలక్ట్రీషియన్ (ఓసిపి), వికే ఓసి కి సింగరేణి కార్పొరేట్ సెంట్రల్ ఫంక్షన్ లో జరుగు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో సింగరేణి కాలరీస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డి. కృష్ణ భాస్కర్ ఐఏఎస్ చే సన్మానం జరుపబడును.

# వైభవంగా బాలికా దినోత్సవం

**- బేటి బచావ్ భేటీ పడవో**

**పాల్వంచ, జనవరి 24 సందేశం టైమ్స్:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవరి శనివారం 24న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ పాల్వంచ గిరిజన బాలికల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహిళా శిశు సంక్షేమ అధికారిని స్వర్ణలత లెనినా పాల్గొన్నారు. ముందుగా కేక్ కట్ చేసి పిల్లలందరికీ స్వీట్లు తినిపించడం జరిగింది. 0 నుంచి 18 సంవత్సరాల లోపు ఉన్న బాలికలకు బాలిక హక్కులు, చట్టాలు, టోల్ ఫ్రీ నెంబర్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా స్థాయిలోని పాఠశాలలు, కళాశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తాం అని తెలిపారు. జిల్లాలో బాలికలకు ఏ సమస్య రాకుండా చూసుకుంటాం అని ఏదైనా సమస్య ఉంటే 1098-టోల్ ఫ్రీ నెంబరు ద్వారా సమస్యలను పరిస్కరిస్తున్నట్టు తెలిపారు. కాల్స్ ద్వారా వస్తున్న ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటూ, బాల్య వివాహాలను నివారించడంలో అవగాహన కీలకమని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో పలు చోట్ల బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు వివరించారు. లింగ నిష్పత్తి మెరుగుపరచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, లింగ నిర్ధారణ చట్టాన్ని కఠినంగా వ్యవహస్తున్నాయి. బాలికలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిని స్వర్ణలత లేనినా. సి డబ్ల్యు సి మెంబర్ సుమిత్ర,. జి సి డి ఓ కొత్త గూడెం,జీసీడీఓ పాల్వంచ,



డిహెచ్ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ సంతోషి రూప స్టాఫ్ మౌనిక ప్రియాంక , డిసిపిఓ స్టాఫ్, కోఆర్డినేటర్, పాఠశాల సిబ్బంది. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల హామీ మేరకు పేరుక అమృతమ్మ కుటుంబానికి రూ. 5000 అందజేత

**సందేశం టైమ్స్:** రాజకీయాల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలోనే నిజమైన నాయకత్వం ఉంటుందని బోయినిపల్లి మండలం బూరుగుపల్లి లో జరిగిన సంఘటన రుజువు చేసింది. గ్రామానికి చెందిన పేరుక మోహన్-సత్తమ్మ గారి తల్లి పేరుక అమృతమ్మ గారు శనివారం అనారోగ్య సమస్యలతో మృతి చెందారు



**.అదే రోజు స్పందన - హామీ నెరవేర్పు:**

గత ఎన్నికల సమయంలో "గ్రామంలో ఎవరైనా చనిపోతే వారి దహన సంస్కారాల నిమిత్తం 5000 రూపాయల ఆర్థిక సాయం చేస్తానని" పెంచాల మహేష్ గారు హామీ ఇచ్చారు . అమృతమ్మ గారు చనిపోయిన విషయం తెలిసిన వెంటనే స్పందించి నేరుగా వారి ఇంటికి వెళ్లి మృతురాలి భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఇచ్చిన మాట ప్రకారం రూ. 5,000 నగదును బాధిత కుటుంబానికి అక్కడికక్కడే అందజేశారు. కష్టకాలంలో తమను పరామర్శించి, తక్షణమే ఆర్థిక సాయం అందించడం పట్ల గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# గుండన్నపల్లిలో మురికి కాలువల శుభ్రం నెల రోజుల్లో పలు అభివృద్ధి పనులు పూర్తి

**సందేశం టైమ్స్:** బోయినిపల్లి మండలం గుండన్నపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మురికి కాలువల శుభ్రత పనులు విస్తృతంగా చేపట్టారు. గ్రామంలో నెల రోజుల వ్యవధిలో పలు అభివృద్ధి పనులు పూర్తిచేసినట్లు గ్రామ సర్పంచ్ లావణ్య నగేష్ తెలిపారు. ముఖ్యంగా ఇళ్ల మధ్యగా ప్రవహించే మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్త,



మట్టిని తొలగించి శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లావణ్య నగేష్ మాట్లాడుతూ, ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా కాలువల శుభ్రత చేపట్టినట్లు తెలిపారు. కాలువల శుభ్రతతో పాటు గ్రామంలో పారిశుద్ధ్య పనులు, డ్రైనేజీ మరమ్మతులు కూడా పూర్తిచేశామని పేర్కొన్నారు. గ్రామస్థులు మాట్లాడుతూ, కాలువల శుభ్రత వల్ల దుర్వాసన, దోమల బెడద తగ్గిందని, ప్రజల ఆరోగ్యానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ సర్పంచ్ గారు స్వయంగా క్షేత్రస్థాయిలో పాల్గొనడం అభినందనీయమని గ్రామస్తులు ప్రశంసించారు.

# బోయినిపల్లి మండలం నుంచి ధర్మ జాగరణ సమితి భారీ బహిరంగ సభకు తరలివెళ్లిన కాషాయదళం

**సందేశం టైమ్స్:** బోయినిపల్లి మండల కేంద్రం నుండి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు కాషాయదళం పెద్ద సంఖ్యలో తరలివెళ్లింది. మండల కేంద్రంలో ముందుగా సమావేశమై ప్రత్యేక బస్సు ద్వారా సభా ప్రాంగణానికి బయలుదేరారు. ఈ సందర్భంగా కాషాయ జెండాలు, ధర్మ జాగరణ సమితి బ్యానర్లతో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. శతాబ్ది ఉత్సవాలు దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్న నేపథ్యంలో, ఈ సభ సనాతన ధర్మ పరిరక్షణ, జాతీయ ఐక్యత, సామాజిక సేవ లక్ష్యంగా నిర్వహించబడిందని నిర్వాహకులు తెలిపారు.

ధర్మ జాగరణ సమితి నాయకులు మాట్లాడుతూ, శతాబ్ది వేడుకలు ప్రతి స్వయంసేవకుడికి గర్వకారణమని, ధర్మ పరిరక్షణలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. బోయినిపల్లి మండలం నుండి కాషాయదళం పెద్ద సంఖ్యలో తరలివెళ్లడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ



జాగరణ సమితి సేవకులు స్వయంసేవకులు, కాషాయదళ కార్యకర్తలు శ్రీనివాస్ రెడ్డి, శరత్ రెడ్డి, సూదుల సాయి అక్షిత్, సురేష్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన అరైవ్ అలైవ్ కార్యక్రమానికి భారీ స్పందన

**సందేశం టైమ్స్:** బోయినిపల్లి మండలం నుంచి అరైవ్ అలైవ్ కార్యక్రమానికి పలు గ్రామాల సర్పంచులు మరియు అధికారులు హాజరయ్యారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచడం, రోడ్డు ప్రమాదాలను నివారించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని నడక కార్యక్రమం



(వాక్‌థాన్)లో పాల్గొన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై బాధ్యతగా వ్యవహరించాలని నిర్వాహకులు కోరారు. ఇలాంటి కార్యక్రమాలు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి విస్తరించాలని పాల్గొన్న సర్పంచులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, సర్పంచులు కొడగాని వెంకటేష్ , మహేశ్వర్ రెడ్డి, లావణ్య నగేష్, అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

# పాఠశాలలో రహదారి భద్రత ఇతివృత్తంపై క్విజ్ పోటీలు నిర్వహించిన. మోటార్ వాహనాల తనిఖీ అధికారులు కె. ఉదయ్ కుమార్, శ్రవణ్ మరియు స్నిగ్ధ


**సందేశం టైమ్స్:** జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని కామారెడ్డి పట్టణంలోని విద్యానికేతన్ పాఠశాలలో రహదారి భద్రత ఇతివృత్తంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలలో వివిధ విద్యాసంస్థల నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రహదారి భద్రతకు సంబంధించిన తమ పరిజ్ఞానాన్ని పరీక్షించుకున్నారు. ఈ సందర్భంగా సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారులు కె. ఉదయ్ కుమార్, శ్రవణ్ మరియు స్నిగ్ధ మాట్లాడుతూ, విద్యార్థులు రహదారి



భద్రతపై ప్రదర్శించిన అవగాహన, ప్రతిభ అభినందనీయమని పేర్కొన్నారు. క్విజ్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు రోజున ఉన్నతాధికారుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వేదికగా నిలిచిన విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యానికి జిల్లా రవాణా శాఖ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# నేరేడ్మెట్ లో ఘనంగా బొడ్రాయి పండుగ వేడుకలు:

**సందేశం టైమ్స్:** మేడిమెట్ల నిర్వహించిన బొడ్రాయి పండుగ ఏకాదశ వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు అభిషేకాలు హోమాలు చేశారు. మహిళలు బోనాలు సమర్పించగా, యువత సాంస్కృతిక కార్యక్రమంలో సందడి చేశారు. గ్రామ పెద్దలు యువకులు మహిళలు పిల్లలు అందరు కలిసి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాజీ కార్పొరేటర్లు బద్దం పరశురాం రెడ్డి, నీరుకొండ జగదీష్ గౌడ్ స్థానిక నాయకులు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# హైదర్ నగర్ లో యు జి డి మంజూరుకు వినతి:

**సందేశం టైమ్స్:** మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాలతో హైదర్నగర్ లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వాటర్ వర్క్స్ జిఎం సునీల్ కు నాయకులు కలిసివినతి పత్రం అందజేశారు. నిత్యం డ్రైనేజీ పొంగిపొర్లడంతో స్థానికుల పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నీరుకొండ జగదీష్ గౌడ్ స్థానిక నాయకులు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



# స్మశానవాటికలకు స్థలాలు కేటాయించండి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి:

**సందేశం టైమ్స్:** మల్కాజిగిరి ప్రాంతం లో అనేక సమస్యలు ఉన్నాయని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజ్గిరి నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీ క్రిస్టియన్ స్మశాన వాటిక లకు స్థలం తగిన స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే సంబంధిత మంత్రులకు, రైల్వే సమస్యలపై ఆయా శాఖల అధికారులపై అధికారులకు వినతులు అందజేశారు.



# మృతురాలి కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యం అందజేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు.

**సందేశం టైమ్స్:**



ఖానాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ యూత్ సభ్యుడు బూర మహేందర్ అమ్మమ్మ కీ.శే" కుసుమ ఎల్లమ్మ వృద్ధాప్యంతో బాధపడుతూ మృతి చెందగా స్థానిక వార్డు సభ్యుడు అజహర్ తరుపున అందించిన 50 కేజీల బియ్యంను సర్పంచ్ దాసరి రమేష్ తో కలిసి బిఆర్ఎస్ పార్టీ నాయకులు మృతురాలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు మైనోద్దీన్,నాయకులు కడుదూరి వెంకటేశ్వర్లు,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాంపల్లి ఫర్నీచర్ మాల్‌లో భారీ అగ్నిప్రమాదం: మంత్రి పొంగులేటి దిగ్భ్రాంతి



**హైదరాబాద్, సందేశం టైమ్స్ - రిపోర్టర్ శెట్టి వెంకటేష్ గౌడ్:** నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఒక ఫర్నీచర్ మాల్?లో శనివారం సంభవించిన భారీ అగ్నిప్రమాదంపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, అధికారులను అప్రమత్తం చేశారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే హైదరాబాద్ జిల్లా కలెక్టర్ మరియు డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్?తో మాట్లాడిన మంత్రి, పోలీస్ మరియు ఫైర్ అధికారుల సమన్వయంతో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, అదనపు ఫైర్ ఇంజిన్లతో మంటలను త్వరగా అదుపులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రతకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ సమీప భవనాలను ఖాళీ చేయించాలని సూచించిన ఆయన, ఈ ఘోర ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ జరిపి సమగ్ర నివేదిక సమర్పించాలని మరియు బాధితులను తక్షణమే ఆదుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.